ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 21    సంచిక : 11    జూలై 2016



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
08814 - 224747
9247104551



ఈ సంచికలో....

27-12-2015
అరుణాచలం

26-01-2016
జిన్నూరు



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-12-2015, అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు రమణస్వామి పుట్టినరోజు. ఆయన పుట్టినరోజు 1912లో విరూపాక్ష గుహ లో ఉండగా ప్రారంభించారు. ఆయనకు తెలియకుండా టౌనులో నుండి కొంతమంది భక్తులు స్వీట్స్ తెచ్చుకొని ఈరోజు మీ బర్త్‌డే అని ఆయనతో చెప్పారు. పుట్టినరోజు జిలేబీ అవీ తినటం కాదు. అసలు ఈ శరీరం మనకు ఎందుకు వచ్చింది. దీనికి కారణం ఏమిటి, మనం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చాము అని ఆలోచించాలి కానీ, మిమ్మల్ని ఈ స్వీట్స్ ఎవరు తెమ్మన్నారు ఇవి ఏమీ వద్దు అని చెప్పారు. ఆ భక్తులు గట్టికారులు. మేము తెచ్చుకొన్నవి పది నిమిషాలు ఇక్కడ కూర్చొని మేమే తినేస్తాము, మీకు కూడా కొంచెం పెడతాము అని చెప్పారు. ఆయనకు ఇష్టం లేకపోయినా బర్త్‌డే అలా ప్రారంభమయింది. అంటే కనీసం బర్త్‌డే రోజున అయినా ఈ శరీరం ఎందుకు వచ్చింది అని విచారణ చేసుకోవాలి కాని, ఇది ఒక పండుగ క్రింద చేసుకోవటం అనవసరం అని ఆయన అభిప్రాయం. కర్మఫలం కదా ఈ శరీరం. ఏ కర్మ చేస్తే మనకు ఈ శరీరం వచ్చింది అని ఆలోచించుకోవాలి కానీ ఈ స్వీట్సు ఇవన్నీ అనవసరం అని చెప్పారు.

స్వేచ్ఛ, విధి వీటి గురించి వివరించమని అడుగుతున్నారు. ఇక్కడ స్వేచ్ఛ అంటే సంకల్పం. మనందరికీ ఏవో సంకల్పాలు వస్తాయి. ఒక సంకల్పం తరువాత యింకో సంకల్పం అలా వస్తూ ఉంటుంది. అసలు మనవుడికి నిస్సంకల్ప స్థితి రావాలి. అది వచ్చే వరకు వాడికి మోక్షంరాదు. మానవుడు విధిని జయించాలి అంటే వాడికి నిస్సంకల్పస్థితి రావాలి అంటే

వాడు సంకల్పరహితుడు అవ్వాలి. అలా జరగాలి ఇలా జరగాలి అని అప్పడు వాడేమీ సంకల్పించడు. కానీ డెస్టినీని బట్టి ఆ శరీరం ద్వారా ఎప్పడు ఏది జరగాలో అది జరిగిపోతూ ఉంటుంది. వాళ్ళ విధి అలా ఉందండి అంటారు, అది ఎవరికి శరీరానికి మాత్రమే స్వేచ్ఛ ఎవరికి మనస్సుకు, స్వేచ్ఛకు, విధికి సంబంధం లేకుండా నీ హృదయంలో ఒక నిజం ఉంది. భగవంతుడు అనే వాడు ఒకడు ఉన్నాడు. మీ శరీరాలను ప్రారబ్ధం ననుసరించి ఆడించెడివాడు ఆయనే. చనిపోయేవరకూ అందరి జీవితాలు ఒకే రకంగా ఉండవు. మన జీవితాలు ఎప్పడు ఎలా ఉంటాయో, ఎప్పడు ఎలా మలుపు తిరుగుతాయో మనం చెప్పలేము. కొంతమంది సంపాదించుకొంటారు, కొంతమంది ఉన్నది పోగొట్టుకొంటారు. ఇలా విధి రకరకాలుగా ఉంటుంది. అసలు విధి ఎక్కడనుండి వచ్చింది అంటే నువ్వు పూర్వజన్మలలో చేసిన కర్మఫలితంగా నీకు విధి అనేది ఏర్పడింది. కర్మను యోగంగా చేస్తే నిన్ను కర్మ బంధించదు. కాని మనందరం కర్మను స్వార్థంతో చేస్తాము. ఇక్కడే చాలా ప్రమాదం ఉంది. మనం స్వార్థం లేకుండా ఒక్క కర్మకూడా చేయటం లేదు. స్వార్థం లేకుండా చేసిన కర్మ మీకుమోక్షాన్ని యిస్తుంది. స్వార్థంతోటి చేస్తే కర్మఫలం వస్తుంది. స్వార్థం లేకుండా పనిచేసేవాళ్ళు మాకు మోక్షం కావాలి అని అడగనక్కరలేదు, మోక్షమే వచ్చి వారిని వరిస్తుంది.

నువ్వు కర్మ చేస్తావు, కర్మ చేసి దాని ఫలితాన్ని ఎంజాయ్‌చేస్తావు, అలా ఎంజాయ్ చేసినప్పడు వాసన పడుతుంది. ఆ వాసనలో నుండి తలంపు వస్తుంది. ఇక్కడ చాలామంది కూర్చొన్నారు, అందరికి సమానమైన తలంపులు వస్తున్నాయా అంటే లేదు. ఎందుచేతనంటే వారి పూర్వకర్మలు వేరు. మీరు కర్మను ఈశ్వరార్పణంగా చేస్తే వాసనపడదు. కానీ మనం ఈశ్వరార్పణ బుద్ధితో పని చెయ్యము. కర్మ చేసి దాని ఫలితాన్ని ఎంజాయ్ చెయ్యటం వలన లోపల వాసన పడుతుంది. ఆ వాసన తలంపుగా నీబ్రెయిన్‌లోనికి వస్తే గాని లోపల నీకు ఏ వాసన ఉందో అది తెలియదు. ఇంకో ప్రమాదం ఏమిటి అంటే నీకు వాసన తలంపు కింద వచ్చాక ఆ తలంపును రిపీట్ చేస్తావు. అలా రిపీట్ చేయటం వలన ఆ వాసన ఇంకా బలపడి పోతుంది. దానిని రిపీట్ చెయ్యకపోతే అది పల్చబడటం ప్రారంభమవుతుంది. వాసనలో నుండి విధి వస్తుంది. ఆ విధి ఎలా పోతుంది అంటే జ్ఞానులతో సాంగత్యం వలన అది పోతుంది. అయితే జ్ఞాని అంటే ఎవడు అంటే నీ హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది, దానితో ఎవడయితే కలిసి ఉంటున్నాడో వాడే జ్ఞాని, అటువంటి వాడితో సహవాసం చేస్తే అది సత్సంగం అవుతుంది. దానివలన విధి పోతుంది. ఒకవేళ సత్యానుభవం ఉన్నవాడు దొరకకపోతే ఏమి చేయాలి

అని అడిగితే అప్పుడు రెండవ పక్షం చెపుతున్నాడు. మంచి స్వభావం ఉన్నవారు, సత్కర్మలు చేసేవారు, లోకంయొక్క హితవు కోరేవారు వారికి జ్ఞానం లేకపోయినా అందరి క్షేమం కోరేవారితో సహవాసం చేసినా వాసన బలహీనపడుతుంది. పునర్జన్మ రావటానికి వాసనే కారణం. జ్ఞానులతో సాంగత్యం వలన వాసనలు అన్నీ కాలి బూడిద అవుతాయి. నీకు వాసనాక్షయం అయిన వెంటనే నీ హృదయంలో ఉన్న నిజం నీకు వ్యక్తమవుతుంది.

మనకు మంచి స్నేహాలు దొరకాలన్నా, మంచి టీచర్స్ దొరకాలన్నా మనకు పూర్వపుణ్యం ఉండాలి. పూర్వపుణ్యం లేకపోతే ఆ కంపెనీ దొరకదు. ఉపనిషత్‌లలో ఋషులు సబ్జెక్టు చెప్పకొని పోతారు. కాని భగవద్గీతలో పరమాత్మ అలా చెప్పేసి వదిలేయడు. మీరు కంగారు పడకండి. నేను మీకు సపోర్టుగా ఉన్నాను అని మధ్యమధ్యలో చెపుతూ ఉంటాడు. మనం ఏమనుకొంటున్నాము అంటే ఇప్పుడు ఉన్నాము, పుట్టకముందు లేము, చనిపోయినతరువాత కూడా ఉండము అనుకొంటాము. మన అనుభవం అంతేకదా. అన్ని కాలాలలో మీరు ఉన్నారు. కానీ ఈ దేహమే నేను అనుకోవటం వలన దేహము పుట్టకముందు నేను లేను, ఈ దేహము చనిపోయాక కూడా నేను ఉండను అని మీరు అనుకొంటున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే శరీరం చనిపోయాక నేను ఏమౌతాను, ఎక్కడికి వెళతాను అని ప్రతీవాడు అడుగుతున్నాడు కానీ మరి శరీరం పుట్టకముందు ఎక్కడ ఉన్నాను అని ఎవడు అడగటం లేదు ఏమిటి. అంటే మీలో దేహబుద్ధి అంతబలంగా ఉంది. ఒక అవతార పురుషుడు, ఒక మహాగురువు ఎవడయినా ఇంటర్‌ఫియర్ అయితే మనకు దేహబుద్ధి పోతుంది కానీ లేకపోతే అది పోదు.

ప్రారబ్ధం అంటే విడిచిపెట్టేసిన బాణంలాంటిది. విడిచిపెట్టకుండా ఉన్న బాణం మన కంట్రోల్‌లో ఉంటుంది కాని విడిచిపెట్టేసిన బాణం మనం ఎవరికి గురిపెట్టామో వాడికి తగిలేస్తుంది. దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే విడిచిపెట్టేసిన బాణం కూడా ఏమీ చేయలేదు అంటే జ్ఞానిని ప్రారబ్ధం కూడా ఏమీ చేయలేదు అన్నారు. ప్రారబ్ధం కూడా తగలదు అని మీరు చెపుతున్నారు కదా మరి మీకు కేన్సర్ వచ్చింది ఏమిటి అని భగవాన్‌ను అడిగారు. చూచేవాడికి భగవాన్ ప్రారబ్ధం అనుభవిస్తున్నాడు అనిపిస్తుంది కాని నేను ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అనుకొనేవాడు ఇక్కడ లోపల ఎవడూ లేడు, అలా అనుకొనేవాడు మధురాయి లోనే చనిపోయాడు. నేను ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అనుకొనేవాడు ఉన్నప్పడు అనుకోకుండా ఎలా ఉంటాడు. ఇక్కడ ఆచార్యులవారి టెక్నిక్ చూడండి, ఆయన ఏమంటున్నారు అంటే ప్రారబ్ధం నీ శరీరానికి తగిలేస్తుంది.

కానీ ఇక్కడ జ్ఞాని బ్రహ్మంతోటి ఏకమై ఉంటాడు. వాడికి మనోదేహములతో సంబంధంలేదు. అందుచేత ప్రారబ్ధం దేహానికి తగిలినా అది వాడికి తెలియదు, అది వాడిని అంటదు. మీరు నిద్రపోతున్నారు అనుకోండి, మీ శరీరం మీద నుండి పాము పాకి వెళ్ళినా అది మీకు తెలియదు. అది శరీరం మీద పాకిన మాట నిజమేకాని అది మీకేమీ తెలియదు. అదేరకంగా ప్రారబ్ధం అంటే విడిచిపెట్టేసిన బాణం కదా అది వాడికి తగిలేస్తుంది కాని తగిలింది అనే విషయం వాడికి తెలియదు. ఎందుచేతనంటే జ్ఞాని బ్రహ్మంలో ఏకమై ఉంటాడు. ప్రారబ్ధం అంటే విడిచిపెట్టేసిన బాణం కదా, నువ్వు దానిని విడిచిపెట్టేసావు కదా ఇక్కడ కృష్ణుడి సపోర్టు ఎలా ఉంటుంది అంటే యుద్ధంలో అర్జునుడిని చంపటానికి కర్ణుడు ఒక ఆయుధం విడిచిపెట్టాడు. అది చాలా శక్తి వంతమైనది, దానిని అడ్డుకొనే అవకాశం లేదు. కర్ణుడు అర్జునుడి యొక్క కంఠానికి గురిపెట్టి ఆయుధాన్ని విడిచిపెట్టాడు. కృష్ణుడు రధాన్ని నడుపుతున్నాడు. ఆయుధం వచ్చేస్తోంది. నేను రక్షణగా ఉంటాను నువ్వు కంగారు పడకు అని భగవంతుడు చెప్పినమాట ఇక్కడ ఉంది. దీనిని మీరు జాగ్రత్తగా పట్టుకోండి. ఆ బాణం చాలా స్పీడుగా వస్తోంది. దానిని అడ్డుకోగలను అని అర్జునుడు అనుకొంటున్నాడు కాని దానిని అడ్డుకోలేడు. అది తగిలితే అర్జునుడు చనిపోతాడు. కృష్ణుడు సర్వజ్ఞుడు కదా. బాణాన్ని కొంచెం దగ్గరగా రానిచ్చి రధాన్ని కిందికి తొక్కేసాడు. దానిని కంఠానికి గురిపెట్టాడుకదా అది అర్జునుడి కిరీటాన్ని పట్టుకొనిపోయింది. వీడు బతికాడు దైవానుగ్రహం అంటే అదే. ఇప్పుడు మీకు అసలు భగవంతుడు అంటే ఏమిటో తెలుస్తోంది కదా.

మీ హృదయంలో బ్రహ్మం ఉంది. తలవెంట్రుక ఎంత సన్నంగా ఉంటుందో అంత కొద్దిగా నువ్వు బ్రహ్మానికి విడిగా ఉన్నా, ఆ కొద్ది తేడా నీకు పునర్జన్మను తీసుకొని వస్తుంది. అందుచేతనే నా మాయను జయించటం మీరు అనుకొన్నంత తేలికకాదు. నా పాదాలను ఆశ్రయించకుండా, నాకు శరణాగతి చేయకుండా నా మాయను మీరు జయించలేరు అని పరమాత్మ చెప్పాడు. మాకు నిప్పపెట్టి నువ్వు దూరంగా పోయావు ఏమిటి అన్నారు కృష్ణుడితో గోపికలు. వారి అజ్ఞానానికి నిప్పపెట్టి పోయాడు, అది కాలటానికి కొంత టైము పడుతుంది. ఇంక వాడు దూరంగా పోయినా ఫరవాలేదు, వారు నెమ్మదిగా తగలబడిపోతారు అంటే మాయ నేను తగలబడిపోతుంది. ప్రమాదం ఎక్కడ వచ్చింది అంటే వీడు పరమేశ్వరుడు అని గోపికలకు తెలియదు, వాడితో ఆడుకొన్నారు. వీడు అగ్ని అని తెలియక వీడితో ఆడుకొన్నారు. వీడితో ఆడుకోవటం వలన వాళ్ళ అజ్ఞానానికి నిప్ప అంటుకొని పూర్తిగా తగులబడిపోయింది. గోపికలు ఎంత గొప్ప స్థితిని పొందారు అంటే ఎవరికయినా గర్వం పెరుగుతూ ఉంటే, అహంకారం

పెరుగుతూ ఉంటే వారితో భగవంతుడు ఏమని చెప్పేవాడు అంటే మీరు ఒకసారి బృందావనం చూసిరండి అని చెప్పేవాడు. ఎందుచేతనంటే గోపికలను చూసాక మీకు ఏమీ తెలియదన్న సంగతి మీకు తెలుస్తుంది, అప్పటివరకు మీకుఅంతా తెలుసు, మేము గొప్పవారము అనుకొంటారు. అందుచేత బృందావనం వెళ్ళిరండి అని పరమాత్మ చెప్పేవాడు. ఉద్ధవుడు లాంటి గొప్ప భక్తుడిని కూడా ఒకసారి బృందావనం వెళ్ళి చూసిరా అని పరమాత్మ చెప్పాడు. కృష్ణుడితో సహవాసం వలన గోపికలు సుప్రీమ్‌స్టేట్‌ను పొందారు. అటువంటి సహవాసం కనుక నీకు దొరికితే నీకు వాసనాక్షయం అయిపోతుంది అని భగవాన్ చెపుతున్నారు.

మీకు పరిస్థితులు రకరకాలుగా ఉంటాయి, కర్మఫలం రకరకాలుగా ఉంటుంది. కాని మీరు శాంతిని పోగొట్టుకొనే పనులు చేయకండి. నువ్వు గమ్యస్థానాన్ని పొందాక, నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలూక అనుభవం నీకు వచ్చాక అప్పడు నీకు ప్రయత్నం ఏమీ ఉండదు. ఇప్పడు ప్రయత్నం చేయకుండా ఉండలేవు. అప్పడు ప్రయత్నం చేద్దామన్నా చేసేవాడు అక్కడ ఉండడు. యిప్పడు మనస్సు ఉంది కాబట్టి మేము ఏమీ ప్రయత్నం చేయము అని నువ్వు నోటితో చెప్పినా మనస్సు ఉన్నంతకాలం మీరు ప్రయత్నం చేయకుండా ఉండలేరు. మనస్సు ఉన్నంతకాలం పూజో, జపమో, కాశీరామేశ్వరము వెళ్ళటమో ఏదో ఒకటి చేస్తూనే ఉంటారు. ఆ ప్రయత్నాన్నే సాధన అంటారు. నువ్వు పొందవలసింది పొందాక ప్రయత్నం చేయటానికి ఏమీ మిగలదు. ఇంక నువ్వు పొందవలసింది ఏమీ లేదు అని నీకు తెలుస్తూ ఉంటుంది. అందుచేత ఇంక ప్రయత్నం ఏమీ ఉండదు.

మీరు మంచివారే. మీరు ఎవరో ఒకరికి ఉపకారం చేస్తున్నారు. కాని పరమాత్మ అడిగేది ఏమిటి అంటే మీరు ఎంతో కొంత ఇతరులకు సహాయం చేస్తున్నారు, మీరు బుద్ధిమంతులే కాని మీరు గౌరవాల కోసం ఈ సోషల్ వర్కు చేస్తున్నారా అంటే ఇతరులచేత గౌరవింపబడాలి అని ఈ పనులు చేస్తున్నారా లేకపోతే పని పనికోసమే చేస్తున్నారా అని అడుగుతున్నాడు. నవ్వు చేసే పని వల్ల నీ మనస్సు పవిత్రం అవ్వాలి. నీ హృదయంలో ఉన్న నిజం ఎంత పవిత్రంగా ఉందో, నీ మనస్సు కూడా అంత పవిత్రం అవ్వకపోతే నువ్వు అందులో ఐక్యంకావటానికి నీకు అవకాశం లేదు. నువ్వు మంచి పనులు చేయటం ఇతరుల చేత గౌరవింపబడటానికి కాదు. వాటివలన మీకు గౌరవం వస్తే రావచ్చు కాని ఈ శరీరం ఎంత నిజమో మనస్సు ఎంత నిజమో మీకు లోకంలో వచ్చే గౌరవాలు కూడా అంతే నిజం. యిదంతా కాలప్రవాహంలో కొట్టుకొని పోతుంది. మన పెద్దవాళ్ళు కష్టపడి వెయ్యి ఎకరాలు సంపాదించి

ఇస్తే వారిని మరిచిపోతున్నాము కదా. అందుచేత మీరు చేసేపని మీ మనస్సు పవిత్రం అవ్వటానికి ఉపయోగపడాలి. మీ హృదయంలో ఉన్న వస్తువు ఎంత పవిత్రంగా ఉందో, నీ మనస్సు అంత పవిత్రం అయితే నది వెళ్ళి సముద్రంలో కలిసినట్లు నీ మనస్సు వెళ్ళి చైతన్యంతో ఐక్యమయిపోతుంది.. ఇక్కడ లాజిక్ ఏమిటి అంటే నువ్వు దేనినైతే పొందావో దానికి పునర్జన్మ లేదు కాబట్టి నీకు కూడా ఇంక పునర్జన్మ ఉండదు.

శరలీం ఉండగానే ప్రయత్నం చేసి నువ్వు పొందవలసింది ఏదో పొందాలి. శరీరం పోయిన తరువాత ఏమీ అవకాశంలేదు. మీరు చేసిన కర్మను బట్టి మళ్ళీ జన్మ వచ్చేస్తుంది. ఉపయోగం లేని మాటలు చెప్పకొంటూ కాలాన్ని పాడుచేసుకోవద్దు. ఏవో పుణ్య కర్మలు చేయటం వలన నీకు ఈ మానవశరీరం వచ్చింది. ఈ శరీరాన్ని ఏవో చిల్లర గొడవలకు ఉపయోగించుకొంటూ దానిని పాడుచేసుకోవద్దు. బ్రహ్మానుభవం పొందటానికి ఈ శరీరాన్ని మనసును మేగ్జిమమ్ ఉయోగించుకో. శాశ్వతమైన శాంతిని పొందటానికి వీటిని ఉపయోగించుకోకుండా, వీటితో మీరు బాహ్యంగా ఏది సాధించినా అది అంతా స్వప్నంతో సమానము. స్వప్నంలో సాధించింది మెలుకువ వచ్చాక నిజం అవుతుందా? మీరు స్వప్నంలో వందకోట్లు సంపాదించారు అనుకోండి. మెలుకువ వచ్చాక నాకువందకోట్లు ఉన్నాయి అని మీరు అనుకొంటారా? ఎందుకు అనుకోరు అంటే అది అబద్ధం అని మీకు తెలిసిపోయింది.

జ్ఞానిచెప్పే ప్రతీమాట కూడా అనుగ్రహం. ఎందుచేతనంటే అది వాడి హృదయంలో నుండి వస్తుంది. మనం చెప్పేమాట నోటిలో నుండి వస్తుంది. జ్ఞాని చెప్పే మాట హృదయంలోనుండి వస్తుంది కాబట్టి అది మనలను బంధించదు, అది మనకు స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. ఆ మాటకూడా అనుగ్రహమే అని ఎవడయితే గుర్తిస్తున్నాడో వాడు మాత్రమే ధన్యుడు. నువ్వు ఇతరులకు ఏదయినా ఉపకారం చెయ్యాలి అంటే నువ్వు జ్ఞానం పొందితే, నువ్వు ఏదిగా ఉన్నావో దానిని గ్రహిస్తే అప్పడు నీ ద్వారా లోకానికి చాలా ఉపకారం జరుగుతుంది. నీకు తెలియకుండానే నీ ద్వారా శాంతి, సుఖం మానవజాతికంతా అందుతుంది. మల్లెపూవులు మీకు వాసన ఇవ్వాలి అని అనుకోవు. నేచురల్‌గా అక్కడ సువాసన ఉంది కాబట్టి ఆ సువాసనను గాలి మీకు మోసుకుని వచ్చేస్తుంది. అలాగే నువ్వు జ్ఞానం పొందితే నీ ప్రభావం లక్షలాదిమందిపై ఉంటుంది. ఈ అరుణాచలం నుండి రమణుడు కదలలేదు, దక్షిణేశ్వరం నుండి రామకృష్ణుడు కదలలేదు. కాని కొన్ని లక్షలమంది ఆకర్షింపబడ్డారు, ప్రపంచం అంతా వచ్చి అక్కడ కూర్చొంది అంటే అది ఎవరి శక్తి, అది చైతన్యం తాలూకు శక్తి. వాడి

నుండి వచ్చే కాంతి, శాంతి అంతా వెదజల్లబడుతుంది. వాడు నిస్సంకల్ప స్థితిలో ఉంటాడు. వీళ్లను ఉద్ధరించాలి లేకపోతే వాళ్లకు సహకరించాలి అని ఆయన ఏమీ అనుకోడు. ఆయనకు సంకల్పం లేదు. ఆయన సంకల్పంతో సంబంధం లేకుండా మీరు పొందవలసింది ఏదో మీరు పొందుతారు. జ్ఞాని సమక్షంలో విషయాన్ని గ్రహించినట్లు మీరు పుస్తకాలు చదవటం వలన, ఉపన్యాసాల వలన గ్రహించలేరు. జ్ఞాని సమక్షంలో మీ లోపల ఉన్న సత్యం మీకు ఎరుకలోనికి రావటానికి సహాయం అందుతూ ఉంటుంది, లోపలఉన్న సత్యవస్తువు మీకు ఎరుకలోనికి వచ్చే అవకాశం ఉంది. గురువు మీకు శాంతిని, జ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు, వాటి సహాయంతో మీకు స్వరూపజ్ఞానం కలుగుతుంది. గురువు యొక్క చూపు నీ హృదయాన్ని తాకుతూ ఉంటే, గురువు నిన్ను అనుగ్రహిస్తూ ఉంటే అప్పుడు నీకు జ్ఞానోదయం అవుతుంది. ఇంక నీకు మాటలు కాని, రచనలుకాని ఏమీ అవసరం లేదు. జ్ఞాని యొక్క సమక్షం నీలో పరివర్తన తీసుకొని వస్తుంది. ఆయన చూపు వల్ల నీకు జిజ్ఞాస కలుగుతుంది. ముముక్షత్వం కలుగుతుంది. హోలీ కంపెనీ వలన మీరు చీకటిలోనుండి వెలుతురులోనికి వెళతారు. మీకు స్వరూపజ్ఞానం కలిగాక అంతకుమించిన సత్యం లేదని మీకు అనుభవంలోనికి వస్తుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-01-2016, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇతరులు మనల్ని మోహపెడుతున్నారని ప్రతీమనిషి అనుకొంటాడు. ఎవరో నిన్ను మోహపెట్టటం లేదు. నీ దేహమే నిన్ను మోహపెడుతోంది. మీరు ఇంటికి వెళ్ళి ఏకాంతంగా కూర్చొని పరిశీలన చేసుకోండి. మనస్సులోకి ఏవో వస్తూ ఉంటాయి. నీకు ఏకోరిక వచ్చినా, ఏ తలంపు వచ్చినా, ఏది వచ్చినా దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని వస్తున్నాయి. దేహము నేను అనే తలంపు ఉంది కదా అందులోనుండే ఈ దుమ్ము అంతా వస్తోంది. ఎవరో ఎవరినో మాయ చేస్తున్నారు అని అనుకోవద్దు. నీ శరీరమే నిన్ను భ్రాంతిలో పెడుతోంది. మీకు ఉన్న ధనాన్ని బట్టి గాని, చదువును బట్టిగాని, గౌరవాన్ని బట్టి గాని దేహానికి సంబంధించిన భ్రాంతిలోనుండి బయటకు రాలేవు. ఏదో డివైన్ ఇంటర్‌ఫియరెన్స్ లేకుండా ఈ భ్రాంతిలో నుండి బయటకు రాలేము. నీ శరీరమే నీ భ్రాంతికి కారణం. ఈ దేహాన్ని పంచభూతాలతో తయారుచేస్తారు. పంచభూతాలు కలిస్తే శరీరం పుడుతుంది, పంచభూతాలు విడిపోతే ఆ శరీరం చనిపోతుంది.

ఆచార్యులవారు ఏమన్నారు అంటే సముద్రంలో ఉన్న మొసళ్ళు ఎటువంటివో నీ